
నమస్తే తెలంగాణ
# వికారాబాద్
13 | హైదరాబాద్, సోమవారం 19 ఫిబ్రవరి 2024 | VIKARABAD



- ప్రణాళిక రూపొందించిన వికారాబాద్ జిల్లా మిషన్ భగీరథ అధికారులు
- వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు
- మిషన్ భగీరథ సరఫరా ఆగిపోతే వెంటనే నీరు అందేలా చర్యలు
- జిల్లాలోని 1446 వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్..
- పైపులైన్ లీకేజీలకూ మరమ్మతులు

## రూ.5.51 కోట్లతో..

# సమ్మర్ యాక్షన్ ప్లాన్



**వేసవిలో జిల్లాలో తాగునీటి సమస్య ఏర్పడకుండా యంత్రాంగం చర్యలు చేపట్టింది. జి ల్లాలోని 566 గ్రామ పంచాయతీల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగకుండా గ్రామీణ నీటి సరఫరా అధికారులు సమ్మర్ యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేశారు. గత వారం రోజులుగా పంచాయతీల్లో తా గునీటి సరఫరాపై పూర్తి వివరాలు సేకరించి ప్రణాళికను రూపొందించారు. మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోతే వెంటనే ప్రత్యామ్నాయంగా అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అంతేకాకుండా మిషన్ భగీరథకు ముందు గ్రామాల్లో ఉన్న పంపుసెట్లకు మరమ్మతులు చేయాలని నిర్ణయించారు. ఇందుకు అవసరమైన వివరాలను సంబంధిత అధికారులు సేకరించి అంచనాలను రూపొందించారు.**

వికారాబాద్, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ) : వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా జిల్లా యంత్రాంగం ప్రణాళిక రూపొందించింది. ఇందుకు ప్రభుత్వం ప్రత్యేక నిధులనూ కేటాయించింది. మరోవైపు బీఆర్ఎస్ హయాంలో జాడలేని సమ్మర్ యాక్షన్ ప్లాన్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ తీసుకొచ్చింది. ప్రజల తాగునీటి అవస్థల ను తీర్చేందుకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ మిషన్ భగీరథ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చి ఇంటింటికీ నల్లాల ద్వారా తాగునీటిని సరఫరా చేసి సమస్యకు శాశ్వతంగా చెక్ పెట్టారు. బీఆర్ఎస్ హయాంలో ఏనాడు కూడా సమ్మర్ యాక్షన్ ప్లాన్లను అధికారులు రూపొందించలేదు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వ యాక్షన్ ప్లాన్ల రూపకల్పనతో మళ్లీ తాగునీటి కష్టాలొస్తాయేమోననే ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**నీటి ఎద్దడిని పరిష్కరించేందుకు..**

జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో వేసవిలో తాగునీటి ఎద్దడిని పరిష్కరించేందుకు రూ.5.51కోట్లతో జిల్లా మిషన్ భగీరథ అధికారులు యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేశారు. గ్రామాల్లో తాగునీటి సరఫరాకు సంబంధించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు పరిగి సబ్ డివిజన్‌కు రూ.1.30 కోట్లు, కొడంగల్ సబ్ డివిజన్‌కు రూ.1.04 కోట్లు, తాండూరు సబ్ డివిజన్‌కు రూ.1.62 కోట్లు, వికారాబాద్ సబ్ డివిజన్‌కు రూ.1.54 కోట్ల నిధులు అవసరమని అధికారులు అంచనా వేశారు. జిల్లాలోని 566 పంచాయతీల్లోని 1446 వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయడంతోపాటు నీటిలో బ్లీచింగ్ వేసేందుకు రూ.1.14 కోట్లు , పైపులైన్ల లీకేజీల మరమ్మతులకు జిల్లావ్యాప్తంగా రూ.2.39 కోట్లు అవసరమని అంచ నా వేసిన అధికారులు పరిగి నియోజకవర్గానికి రూ. 54.83లక్షలు, కొడంగల్ సబ్ డివిజన్‌కు రూ.51.15లక్షలు, తాండూరు సబ్ డివిజన్‌కు రూ.63.15లక్షలు, వికారాబాద్ సబ్‌డివిజన్‌కు రూ.70.1 లక్షలు అవసరమని యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేశారు. అదేవిధంగా జిల్లాలో 3,360 పంపుసెట్లు ఉండగా, వీటిలో పరిగిలో 1,176, కొడంగల్ సబ్‌డివిజన్‌లో 434, తాండూరు సబ్ డివిజన్‌లో 1008, వికారాబా ద్ సబ్‌డివిజన్‌లో 742 పంపుసెట్లు ఉన్నాయి. జిల్లాలో పాడైన పంపుసెట్లకు మరమ్మతులు చేసేందుకు రూ.1.97 కోట్లు అవసరమని అంచనా వేయగా వాటిలో పరిగికి రూ.60.40 లక్షలు, కొడంగల్ సబ్ డివిజన్‌కు రూ.21.70 లక్షలు, తాండూరు సబ్ డివిజన్‌కు రూ.56.25 లక్షలు, వికారాబాద్ సబ్ డివిజన్‌కు రూ.59.55 లక్షలు అవసరమని అధికారులు తేల్చి చెప్పారు. నవాబుపేట, మర్పల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్య ఉన్నట్లు గుర్తించారు.

**'మిషన్ భగీరథ'తో తాగునీటి సమస్యకు చెక్..**

బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. వేల కోట్లు ఖర్చు చేసి శ్రీశైలం నుంచి తాగునీటిని తీసుకొచ్చి ప్రజల దాహార్తిని తీర్చింది. మాజీ సీఎం కేసీఆర్ తీసుకున్న చర్యలతో తాగునీటి కష్టాలకు శాశ్వతంగా చెక్ పడడంతోపాటు ఇంటి వద్దే నల్లాల ద్వారా తాగునీరు అందుతున్నది. మిషన్ భగీరథ లో భాగంగా జిల్లాకు శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి తాగునీరు అందు తున్నది. 230కిలోమీటర్ల దూరంలోని కొల్లాపూర్ రిజర్వాయర్ నుంచి నీటిని ఎత్తిపోస్తూ జిల్లాలోని రాఘవపూర్, కొడంగల్‌లోని వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లకు సరఫరా చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా మిషన్ భగీరథ పనుల్లో భాగంగా రూ.1,070 కోట్లతో ప్రధాన పైపులైన్లు, ఓహెచ్‌బీఆర్‌లు, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నిర్మాణం, రూ.413 కోట్ల తో ఇంట్రా విలేజ్ పనులు పూర్తి చేసి తాగునీటిని అందిస్తున్నారు. అయితే వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లోని 971 ఆవాసాలకు, 1,98,162 కుటుంబాలకు ఇంటింటికీ నల్లా ల ద్వారా భగీరథ నీరు సరఫరా జరుగుతున్నది. జిల్లాలో తాగునీటిని అందించేందుకు 1,920 కిలోమీటర్ల పైపులైన్, 874 ఓహెచ్ఎస్ఆర్‌లు నిర్మించారు.





**సీఎంఆర్ లక్ష్యాన్ని పూర్తి చేయడంలో అనేక జిల్లాలు వెనుకబడి ఉన్నాయి. ధాన్యానికి కస్టమ్ మిల్లింగ్(సీఎంఆర్) చేయడంలో మిల్లర్లు తీవ్ర జాప్యం చేస్తున్నారు. అయితే రంగారెడ్డి జిల్లా మాత్రం 2022 -23 యాసంగి సీజన్‌కు సంబంధించి లక్ష్యాన్ని పూర్తి చేసింది. వానకాలం సీజన్‌కు సంబంధించి 46 శాతం బియ్యం సేకరణ పూర్తైంది. జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి.. మిల్లర్లపై ఒత్తిడి చేయడం వంటి చర్యల ఫలితంగా సీఎంఆర్ లక్ష్యం పూర్తికి అడుగులు వేగంగా పడుతున్నాయి.**

- రంగారెడ్డి జిల్లాలో గత యాసంగికి సంబంధించిన బియ్యం సేకరణ పూర్తి
- వానకాలంలో 46 శాతం పూర్తి
- ఈ నెలాఖరులోగా మిగతా బియ్యం ఇచ్చేందుకు మిల్లర్ల చర్యలు
- మిల్లర్లను భయపెడుతున్న ఖాప్రా పురుగు

# సీఎంఆర్ సేకరణలో ముందంజ

రంగారెడ్డి, ఫిబ్రవరి 18(నమస్తే తెలంగాణ) : బియ్యం సేకరణకు భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) పచ్చజెండా ఊపడంతో మిల్లింగ్‌పై దృష్టి పెట్టారు. త్వరితగతిన సేకరణ జరిగేలా పౌరసరఫరాల అధికారులు మిల్లర్లపై ఒత్తిడి తెస్తున్నారు. జిల్లాలో 2022-23 యాసంగి సీజన్‌కు సంబంధించి 20,409.960 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పౌరసరఫరాల శాఖ మిల్లర్లకు అప్పగించింది. ఇందుకు బదులుగా మిల్లర్లు 13,825.20 మెట్రిక్ టన్నుల సీఎంఆర్‌ను ఎఫ్‌సీఐకి అప్పగించాల్సి ఉండగా..13,188.352 మెట్రిక్ టన్నులు వచ్చింది. కడ్తాల్‌కు సంబంధించిన ఓ రైస్‌మిల్లు నుంచి సీఎంఆర్ రాకపోవడంతో అధికారులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఈ కొద్ది సీఎంఆర్ మినహా యాసంగికి సంబంధించి లక్ష్యం దాదాపు పూర్తయి నట్లేనని అధికారులు చెబుతున్నారు. 2002-03 వానకాల సీజన్‌కు సం బంధించి 41,304.720 మెట్రిక్ టన్నుల ధాన్యానికి మిల్లర్ల నుంచి 28,156.005 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ రావాల్సి ఉంది. ఈ నెలాఖరు వరకు సీఎంఆర్‌కు గడువు ఉండగా.. పౌరసరఫరాల శాఖ అధికారులు మిల్లులను తనిఖీ చేస్తూ రోజువారీగా వివరాలు సేకరిస్తున్నా రు. ఈ క్రమంలో ఇప్పటివరకు 12,836.264 మెట్రిక్ టన్నుల(46 శాతం) సీఎంఆర్ లక్ష్యం పూర్తయ్యింది. మిల్లుల మిల్లింగ్ సామర్థ్యం మేరకు ఈ నెలాఖరు లోపుగా లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు.

**సీఎంఆర్ లక్ష్యంపై ఖాప్రా పురుగు ప్రభావం ..**

ఎఫ్‌సీఐకి తరలిస్తున్న సీఎంఆర్ బియ్యంలో ఖాప్రా పురుగు కనిపించడం మిల్లర్లను ఆందోళనకు గురిచేస్తున్నది. మరపట్టిన బియ్యాన్ని ఎప్పటికప్పుడు కౌకుంట్ల, చర్లపల్లి తదితర ఎఫ్‌సీఐ గోదాములకు తరలిస్తున్నారు. రైస్ మిల్లుల్లో నిల్వ ఉంచిన బియ్యం బస్తాలకు ఖాప్రా పురుగు సోకగా.. రోజురోజుకూ ఈ చీడ బెడద ఎక్కువవుతున్నది. చాలాకాలంగా మిల్లుల్లో బియ్యాన్ని నిల్వ చేసి ఉంచడం వల్ల పురుగు ఆశించి బియ్యాన్ని పిండిగా చేస్తున్నది. ఖాప్రా పురుగు ఆశించిన బి య్యాన్ని ఎఫ్‌సీఐ అధికారులు తిరస్కరిస్తుండడంతో లారీలను వెనక్కి తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొన్నది. దీంతో మిల్లర్లు బియ్యం లోడింగ్ నుంచి ట్రాన్స్‌పోర్టు వరకు ఒక్కో లారీకి రూ.లక్ష వరకు నష్టపోతున్నారు. ఈ సీజన్‌లోనే ఇప్పటివరకు 20 లారీలకు పైగా బియ్యాన్ని ఎఫ్‌సీఐ తిరస్కరించడంతో మిల్లర్లు తలలు పట్టుకుంటున్నారు. బి య్యం బస్తాలను ఎండకు ఆరబెట్టడం వంటి జాగ్రత్తలను తీసుకుంటున్నా ఫలితం లేదని మిల్లర్లు వాపోతున్నారు. కొత్త బస్తాలు ఇవ్వాలని కోరుతున్నప్పటికీ పౌర సరఫరా శాఖ నుంచి ఇచ్చే పరిస్థితి లేదు. ఖాప్రా చీడ పురుగు ప్రభావం సీఎంఆర్ లక్ష్యంపైనా ప్రభావం చూపుతున్నది.


# నువ్వా..నేనా?

## ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కొనసాగుతున్న అవిశ్వాసాల పర్వం

- ఇప్పటికే పూర్తైన ఆదిబట్ల, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలు
- త్వరలో ఉప్పరిగూడ, బాటసింగారం సహకార సంఘాల చైర్మన్లపై అవిశ్వాసాల బలపరీక్ష

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 18 : ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో అవిశ్వాసాల పర్వం కొనసాగుతున్నది. ఇప్పటికే ఆదిబట్ల, ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్లపై అవిశ్వాసాల బలపరీక్ష పూర్తైంది. కాగా, ఇబ్రహీంపట్నం మండలంలోని ఉప్పరిగూడ సహకార సంఘం చైర్మన్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని బాటసింగారం సహకార సంఘం చైర్మన్లపై అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టారు. ఉప్పరిగూడ సహకార సంఘం చైర్మన్‌గా ప్రస్తుతం బీఆర్ఎస్‌కు చెందిన టేకుల సుదర్శన్‌రెడ్డి కొనసాగుతున్నారు. ఈ సహకార సంఘం పరిధిలో మొత్తం 13 మంది డైరెక్టర్లు ఉండగా చైర్మన్, వైస్‌చైర్మన్ మినహా 11మంది డైరెక్టర్లు చైర్మన్, వైస్‌చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సహకార సంఘంలో బీఆర్ఎస్‌కు స్పష్టమైన మెజార్టీ ఉన్నప్పటికీ పలువురు డైరెక్టర్లు ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన పాండురంగారెడ్డి 11మంది డైరెక్టర్లతో కలిసి చైర్మన్, వైస్‌చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ అవిశ్వాస తీర్మానంపై ఈనెల 22న బలపరీక్ష నిర్వహించనున్నారు. ఇందుకోసం కాంగ్రెస్ పార్టీకి చెందిన పాండురంగారెడ్డి 11మంది డైరెక్టర్లతో ప్రత్యేక క్యాంపును ఏర్పాటు చేశారు. అలాగే, అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని బాటసింగారం సహకార సంఘం చైర్మన్‌పై కూడా కాంగ్రెస్ మద్దతుతో సొంత పార్టీ వారే అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సహకార సంఘం పరిధిలో మొత్తం 13 మంది డైరెక్టర్లు ఉండగా.. ఒక డైరెక్టర్ అనారోగ్యంతో మృతి చెందాడు. ప్రస్తుతం 12 మంది డైరెక్టర్లులు ఉన్నారు. ఇందులో కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరితో కలిపి మరో ఏడుగురు బీఆర్ఎస్ సానుకూల డైరెక్టర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. దీంతో చైర్మన్‌కు వ్యతిరేకంగా 9 మంది డైరెక్టర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ అవిశ్వాస తీర్మానంపై ఈనెల 28న బలపరీక్ష నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. చైర్మన్ వ్యతిరేకవర్గం డైరెక్టర్లు ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేశారు. ఈ రెండు సహకార సంఘాల చైర్మన్లపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాలు చర్చనీయాంశంగా మారాయి.

**ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ ఎంపికపై కొనసాగుతున్న సస్పెన్షన్..**




ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ఆదిబట్ల మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం బలపరీక్షలో చైర్‌పర్సన్ ఓడిపోయారు. ఇదే మున్సిపాలిటీకి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు మర్రి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన 13 మంది అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. ఈనెల 9న నిర్వహించిన బలపరీక్షలో కాంగ్రెస్ పార్టీకి చెందిన చైర్‌పర్సన్ ఓడిపోయారు. సొంత పార్టీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారన్న అభియోగంపై నిరంజన్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఆదిబట్ల మున్సిపాలిటీ నూతన చైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నట్లయితే నిరంజన్‌రెడ్డి చైర్మన్ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరించిన నిరంజన్‌రెడ్డిని చైర్మన్‌గా ఎన్నుకోకుండా ఆయన వ్యతిరేక వర్గం గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నది. బలపరీక్ష పూర్తై 15 రోజులు దాటినప్పటికీ నూతన చైర్మన్ ఎన్నిక కోసం గడువు ఇవ్వడం లేదు. దీంతో చైర్మన్ ఎన్నికకు సంబంధించి గడువు ఇస్తారా.. లేదా అన్న దానిపై ఉత్కంఠ నెలకొన్నది. కాగా, ఇబ్రహీంపట్నం చైర్‌పర్సన్ కప్పరి స్రవంతిపై బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాసం వీగిపోయింది.



ఉప్పరిగూడ సహకార సంఘం కార్యాలయం



- ఎండ@ 37.1 డిగ్రీలు
- ఉదయం 8 గంటల నుంచే సెగలు కక్కుతున్న సూరీడు
- బయటకు వెళ్లాలంటే జంకుతున్న జనం
- వేడిగాలులతో వడదెబ్బ బారిన పడే ప్రమాదం
- ఇప్పుడే ఇలా ఉంటే రానున్న రోజుల్లో ఎలా ఉంటుందోనని ఆందోళన
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు



# ఎండలు షురూ..

షాబాద్, ఫిబ్రవరి 18: వేసవి కాలం ఆరంభంలోనే ఎండలు దంచికొడుతున్నయ్. రోజురోజుకూ పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. జిల్లాలో గత వారం రోజులుగా అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గతేడాది కంటే ఈ ఏడాది ఎండలు అధికంగా ఉండడంతో ప్రజలు ఇండ్ల నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. జిల్లాలో ఆదివారం గరిష్ఠంగా 37.1 డిగ్రీలు కనిష్ఠం 12.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 8 గంటల నుంచే భానుడు భగభగ మండుతుండడంతో రోడ్లన్నీ వెలవెలబోతున్నాయి. నిన్న, మొన్నటి వరకు చల్లగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా వేడెక్కగా, జనం కూలర్లు, ఏసీలను వినియోగిస్తున్నారు. ప్రస్తుతం పగటి ఉష్ణోగ్రతలు 30-37 డిగ్రీలకు వరకు నమోదు కాగా, రాత్రి ఉష్ణోగ్రతలు 18 డిగ్రీలకు పైగా ఉంటున్నాయి. ఇప్పుడే ఇలా ఉంటే రానున్న రోజుల్లో ఎండలు ఎలా ఉంటాయోనని జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఎండలతో ఉక్కిరిబిక్కిరి..**

మొన్నటి వరకు చలితో సతమతమైన ప్రజలు ప్రస్తుతం ఎండలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. భానుడు ఫిబ్రవరి నెలలోనే భగ్గుమంటున్నాడు. దీంతో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరిగుతున్నాయి. వారం క్రితం తీవ్ర చలిగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా వేడెక్కడంతో ప్రజలు బయటకు వెళ్లాలంటే భయపడుతున్నారు. ఉదయం, రాత్రి వేళల్లో చలి ప్రభావం ఉన్నప్పటికీ మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతున్నది. రోడ్లపైన జనాలు కనిపించడం లేదు. పెండ్లిళ్ల సీజన్ కావడంతో టవల్, చేతి రుమాల్, టోపీలు, గొడుగులను ధరించి కనపడుతున్నారు. ఇప్పుడే ఎండల తీవ్రత ఇంతస్థాయిలో ఉంటే... మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఎండలు ఎలా ఉంటాయోనని ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కూలీలు ఎండల కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు వేసవి తాపం నుంచి కాపాడుకోవడానికి ఎక్కువగా కొబ్బరి బొండాలు, నిమ్మకాయ పానీయాలు, లస్సీలు, పండ్ల రసాలు తాగుతున్నారు.

**రానున్న రోజుల్లో ఎక్కువగా ఉండే అవకాశం**

ఈ ఏడాది మార్చి, ఏప్రిల్, మే నెలలతో పాటు రోహిణి కార్తె ఎండలు తీవ్రంగా ఉండే అవకాశం కనిపిస్తున్నది. ఇప్పటి వరకు ఉన్న వాతావరణం వేరు, రానున్న కాలంలో పరిస్థితులు వేరుగా ఉండనున్నాయి. రాత్రిపూట చలి, మధ్యాహ్నం వేడిగా ఉంటుంది. ప్రతి రోజూ భిన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలో వైరల్ జ్వరాలు పెరిగాయి. జ్వరం, దగ్గు, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలతో చాలా మంది బాధపడుతున్నారు. దినసరి కూలీలు ఉదయం పూటనే పనులు పూర్తి చేసుకుని మధ్యాహ్నంలోగా ఇంటికి చేరుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఇక నుంచి మధ్యాహ్నం పూట బయటికి వెళ్లాలంటే తప్పకుండా గొడుగులు వెంట తీసుకువెళ్లాలని చెబుతున్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు చాలా జాగ్రత్తగాఉండాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచిస్తున్నారు. మరోమూడు నెలలు ఎండలు అధికంగా ఉండే అవకాశం ఉందని, వడగాల్పులు వీచే అవకాశాలున్నట్లు, ప్రజలు బయట తిరగకుండా జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

